
లక్ష్మి

బిడ్డలను చదివించుకోవాలని కష్టపడి కువైట్‌కు వెళ్లిన మహిళకు కష్టాలు మిగిలాయి.గొడ్డు చాకిరీ చేసినా కనికరంలేదు. కడుపునిండా తిండిలేదు. కంటినిండా కునుకు లేదు. ఒక్క పూట భోజనం, గ్లాసు మంచినీళ్లతో మూత్రంలో రక్తస్రావమవుతూ నరకం అనుభవిస్తోంది శ్రీకాళహస్తికి చెందిన ఓ మహిళ.

కువైట్‌లో శ్రీకాళహస్తి మహిళ ఆవేదన

నన్ను చంపి ఎడారిలో పడేస్తామంటున్నారు

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- మూత్రంలో రక్తం వస్తోంది
- ప్రతిక్షణం నరకం అనుభవిస్తున్నా

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం రాజీవ్ నగర్‌కు చెందిన ఎల్లంపల్లి లక్ష్మి ఆర్థిక ఇబ్బందులతో బిడ్డల చదువుకోసమని కువైట్‌కు వెళ్లారు. అక్కడ ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను సెల్ఫీ వీడియోలో ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'నా పేరు లక్ష్మి. కువైట్‌లో ఇరుక్కుపోయాను. రూ2.5లక్షలు కడితేనే ఇండియాకు పంపుతామంటున్నారు. ఘోరంగా కొడుతున్నారు. ఏజెంట్ దగ్గరకు వెళ్లి చెబితే ఇక్కడే నిన్ను చంపి ఎడారిలో వేసేస్తాం అని బెదిరిస్తున్నారు. నా ఆరోగ్యం సహకరించడంలేదు. మూత్రానికి బదులు రక్తం వస్తోంది. ఇంటికి ఫోన్ చేసుకునే అవకాశం ఇవ్వడంలేదు. బయటకు రాకుండా బీగాలు వేసేశారు. నన్ను ఎలాగైనా ఇండియాకు పంపండి' అని సెల్ఫీ వీడియో ద్వారా లక్ష్మి వేడుకున్నారు.

తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాం

శ్రీకాళహస్తికి చెందిన లక్ష్మిని ఇండియాకు పంపే ప్రయత్నం చేస్తున్నాం. ఆమె కువైట్‌లో ఇబ్బందులు పడుతున్నట్టు మాదృష్టికి వచ్చింది. ఏజెంట్లతో మాట్లాడుతున్నాం. రూ2.5లక్షలు అడుగుతున్నారు. తెలుగు ఎన్ఆర్ఐల సహకారం తీసుకుంటున్నాం.


- డాక్టర్ ముక్కు తులసీకుమార్, ఏపీఎన్ఆర్టీ యూఏఈ మాజీ ఇంచార్జి

మా అమ్మను రప్పించండి సారూ..

కువైట్‌లో నరకయాతన అనుభవిస్తున్న తమ అమ్మను తీసుకురావాలని సుచిత్ర కన్నీటి పర్యంతమవుతోంది. తన తల్లి పడుతున్న కష్టాలు చూసి తల్లడిల్లుతోంది. ఎలాగైనా ఆమెను తమ వద్దకు చేర్చాలని అధికారులను వేడుకుంటోంది. 'మా చదవుల కోసమని పీలేరులోని శ్రీనివాసులు అనే ఏజెంట్ సహకారంతో కువైట్‌కు వెళ్లింది. అతడు కుమారి అనే కువైట్ ఏజెంట్‌కు మా అమ్మను అప్పజెప్పారు. ఆమె రెండిళ్లలో పనికి కుదర్చింది. ఎంత పనిచేస్తున్నా చేయడంలేదని హింసిస్తున్నారు. అక్కడ ఉండలేమని ఇండియాకు వెళ్లిపోతామని మా అమ్మ ఏజెంట్ దగ్గరకు వెళ్లారు. ఏజెంట్ లేని సమయంలో నాకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు' అంటూ సుచిత్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



జగనన్న కాలనీలపై విజి'లెన్స్'



- ముమ్మరంగా దర్యాప్తు
- రెండు ప్రాంతాల్లోనే రూ.4.56 కోట్ల అవినీతి జరిగినట్లు అంచనా

జగనన్న కాలనీల్లో అవినీతి, అక్రమాలపై విజిలెన్సు అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. 5వేల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్న రెండు ప్రాంతాల్లోనే ఇప్పటికి రూ.4.56 కోట్ల అవినీతి జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. వీటిపై విజిలెన్సు డీజీ హరీష్‌కుమార్ గుప్తాకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ఆయన విచారణకు ఆదేశించారు. విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ నేతృత్వంలో మూడు బృందాలు తనిఖీలు చేస్తున్నాయి.

ఏర్పేడు మండలం చిందేపల్లి, చంద్రగిరి మండలం ఎం.కొత్తపల్లి ప్రాంతాల్లో నిర్మించదలచిన దాదాపు 5000 జగనన్న ఇళ్ల నిర్మాణాన్ని గత వైసీపీ ప్రభుత్వం థర్డ్ ఆప్షన్ కింద ఓ కంపెనీకి కట్టబెట్టింది. ఒక్కో ఇంటికి రూ1.80లక్షలు మంజూరు చేసింది. ఇందులోనే సిమెంటు, కమ్మీ, ఇతర ముడిపదార్థాలను నేరుగా హౌసింగ్ శాఖ ద్వారా సరఫరా చేయాలని నిర్ణయించింది. ఇక్కడ్నుంచే కొందరు అక్రమాలకు తెరతీసినట్లు ఆరోపణలున్నాయి. ఈ ఫిర్యాదులపై విజిలెన్సు విచారణ చేపట్టింది. చిందేపల్లిలో నిర్మించదలచిన దాదాపు 3500 గృహాల్లో పూర్తి కానివి దాదాపు 80 శాతం వరకున్నాయి. వీటిలో పునాది దశ దాటని ఇళ్లకు, పునాదులు పూర్తయినట్లు ఎం.బుక్కుల్లో నమోదు చేసి నిధులు స్వాహా చేశారన్న విమర్శలున్నాయి. అలాగే గోడలు నిర్మించిన దశలో దాదాపు 800 ఇళ్లు ఉండగా వాటికి మోల్డింగ్ పూర్తయినట్లు లెక్కలు చూపినట్లు అధికారుల తనిఖీల్లో తెలిసిందని సమాచారం. పునాది పడని ఇళ్లకూ పినట్లు ఎం.బుక్కులు నమోదైనట్లు సమాచారం. ఇక, ఎం.కొత్తపల్లిలో నిర్మించదలచిన 1500 ఇళ్లలో కనీసం 60 శాతం ఇళ్ళు కూడా పూర్తికాకనే బిల్లులు రాసుకున్నట్లు.. చాలా ఇళ్లు పూర్తికాకున్నా పూర్తయినట్లు ఎం.బుక్కులు నమోదు చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఒక్కో ఇంటికి 100 బస్తాల సిమెంటు ఇవ్వాల్సి ఉండగా, 40 నుంచి 45 మాత్రమే ఇచ్చి పూర్తిగా ఇచ్చినట్లు.. పునాది దశలో ఉన్న ఇళ్లకు గోడలు దశ పూర్తయిందని.. ఇక, మోల్డింగ్‌కు దాదాపు 2500 ఇళ్లు ఉన్నాయని లెక్కలు చూపి నిధులు పక్కదారి పట్టినట్లు విజిలెన్సు అధికారులు తనిఖీల్లో బయటపడినట్లు తెలుస్తోంది. ఇలా దాదాపు రూ.4.56 కోట్లు దుర్వినియోగమైనట్లు ఇప్పటి వరకున్న సమాచారం ఆధారంగా తెలుస్తోంది. ఈ అక్రమాల వెనుక ఎవరెవరున్నారనే దిశగానూ దర్యాప్తు సాగుతున్నట్లు సమాచారం. మరో వారం రోజుల్లో ప్రభుత్వానికి విచారణ నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

- నేడు జాతీయ రైతు దినోత్సవం

స్వేదం చిందించి సేద్యం సాగించి..!

కోటీశ్వరుడి నుంచి కూలీ వరకు.. ఐదు వేళ్లు నోట్లోకి పోవాలంటే రైతు చెమటను చిందించాలి.
నష్టం వచ్చినా.. ప్రకృతి సహకరించక పోయినా.. సేద్యం చేస్తూ.. అందరి ఆకలి తీరేది.

అలాంటి అన్నదాతలకోసం డిసెంబరు 23న (సోమవారం) జాతీయ రైతు దినోత్సవం నిర్వహిస్తున్నారు. 'భారతదేశపు రైతుల విజేత'గా గుర్తింపు పొందిన మన దేశ 5వ ప్రధాని చరణ్‌సింగ్ పుట్టిన రోజును రైతు దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రజారోగ్యాన్ని కాంక్షించి ప్రకృతి సేద్యం సాగిస్తున్న రైతు అయ్యప్పనాయుడు.. మండలంలోనే తొలిసారిగా పామోలిన్ సాగు చేసిన ఎయిర్‌ఫోర్సు విశ్రాంత ఉద్యోగి శంకర్‌రాజు.. వ్యవసాయంపై మక్కువతో ఉద్యోగం వదిలి పొలంబాట పట్టిన అశోక్‌రెడ్డి గురించి తెలుసుకుందాం.


సంప్రదాయ పద్ధతులతో సాగవుతున్న వరి

కషాయం తయారీపై విదేశీయులకు అవగాహన కల్పిస్తున్న రైతు అయ్యప్పనాయుడు



పుష్కరంగా ప్రకృతి సేద్యం

దామా అయ్యప్పనాయుడు.. తిరుపతి రూరల్ మండలం వేమూరు గ్రామం. అధిక దిగుబడి కోసమని హైబ్రిడ్ విత్తనాలు, క్రిమిసంహారక మందులతో పంటలు సాగు చేయడం వల్ల ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతుందని ఆందోళన చెందారు. భావితరాల మనుగడ కోసం ప్రకృతి సేద్యంవైపు అడుగులు వేశారు. 12 ఏళ్లకుపైగా తనకున్న ఆరు ఎకరాల్లో ప్రకృతిసేద్యం చేస్తూ మిగతా రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. పంట పోషకాలకు జీవామృతం, ఘనామృతం వాడుతున్నారు. పురుగుల నివారణకు వేప, కానుగ, ఉమ్మెత్త, సీతాఫలం, ఆముదంతో కలిపి కషాయం తయారు చేసి పిచికారీ చేస్తున్నారు. నవార, మైసూరు మల్లిగ వంటి సంప్రదాయ వరిపంటను సాగుచేస్తున్నారు. 'నిరంతర పంటలు.. ఆదాయం' అనే అంశంతో మూడు ఎకరాల్లో సంప్రదాయ పద్ధతులతో కూరగాయల సాగు చేపట్టారు. మామిడిలో అంతర పంటలనూ వేస్తున్నారు. రెండు ఎకరాల్లో మల్బరీ తోట వేశారు. వర్మీకంపోస్టు తయారు చేస్తున్నారు. పాడిపరిశ్రమ ఉంది. ప్రతి పంటనూ ప్రకృతి పద్ధతులతో సాగు చేస్తున్నారు. ఈయన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని వివిధ కళాశాలల విద్యార్థులే కాకుండా దేశ, విదేశాల్లోని పలువిశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లు, రైతులు, విద్యార్థులు సందర్శించారు. మెక్సికో, ఆఫ్రికా దేశాలకు చెందిన ప్రొఫెసర్లు, అధికారులు కూడా వచ్చారు.

'రసాయన వ్యవసాయం వల్ల జీవ వైవిధ్యానికి నష్టం కలుగుతుంది. విపరీతమైన పెట్టుబడి. క్రమంగా నేల సారం క్షీణిస్తోంది. తద్వారా వ్యవసాయం సంక్షోభంలోకి చేరుకునే ప్రమాదం ఉంది. వర్డ్ సంస్థ ప్రతినిధి గంగాధరం ఉన్న పరిచయం కారణంగా భావితరానికి మంచి నేలను, మంచి పోషకాలున్న ఆహారాన్ని అందించాలని ప్రకృతి వ్యవసాయంపై దృష్టిపెట్టా'నంటారు అయ్యప్పనాయుడు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి


పైరు పరిశీలిస్తున్న రైతు కామిరెడ్డి అశోక్‌రెడ్డి

ఉన్న ఊరు.. సేద్యంపై మక్కువ

కామిరెడ్డి అశోక్‌రెడ్డి.. నాయుడుపేట మండలం మడఫళం. అకౌంట్స్‌లో పట్టభద్రుడు. ఓ ఫ్యాక్టరీలో సీనియర్ అకౌంటెంట్‌గా మంచిజీతం. అయినా ఉన్న ఊరు.. వ్యవసాయంపై మక్కువతో పొలం బాట పట్టారు. తనకున్న 11 ఎకరాలలో వరిసాగు చేపట్టగా.. తొలిసారి ఆదాయం రాలేదు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు భూమి దుక్కినుంచి, విత్తనశుద్ధి, సాగు నీటి యాజమాన్యం, ఆధునికీకరణ పద్ధతులను పాటించడంతో ఎకరాకు 45నుంచి 50 బస్తాల ధాన్యం పండిస్తున్నట్లు అశోక్‌రెడ్డి చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో రైతులకు రాయితీతో పని ముట్లు, జిప్సం, బోరోనియం వంటి భూసారం చేసేవంటివి ఇచ్చే వారన్నారు. వైసీపీ పాలనలో వ్యవసాయ రంగాన్ని విస్మరించారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆధునిక పరికరాలు, డ్రోన్లు సబ్సిడీలో అందజేయాలని కోరారు.

- నాయుడుపేట, ఆంధ్రజ్యోతి



ట్రాక్టర్‌లో పరిశ్రమకు తరలుతున్న పామోలిన్
- పామోలిన్ పంట

ఎయిర్‌ఫోర్సు నుంచి సేద్యానికి

శంకర్‌రాజు.. కేవీబీపురం మండలం పూడి సీకేపురానికి చెందిన ఎయిర్ ఫోర్స్‌లో పదవీ విరమణ చేశారు. స్వగ్రామానికి చేరిన వ్యవసాయంపై మక్కువతో రైతుగా మారారు. కొత్తగా సాగు చేయాలని యోచించిన ఆయన పామోలిన్‌పై దృష్టి పెట్టారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఐదు ఎకరాల్లో పామోలిన్ సాగు చేపట్టారు. మూడేళ్ల కాలపరిమితి దాటిపోవడంతో పంట చేతికి వచ్చింది. మండలంలోనే తొలిసారిగా పామోలిన్ మొక్కలను ఆయనే నాటారు. గతంలో టన్ను రూ.13,150 ఉండగా ప్రస్తుతం రూ.22,500కి చేరింది. తక్కువ పెట్టుబడి.. సమయం ఆదాతో పాటు లాభాలు పొందే అవకాశం ఉందని భావించిన చాలామంది రైతులు శంకర్‌రాజు వద్దకు వచ్చి పామోలిన్ సాగుపై సలహాలు తీసుకుంటున్నారు. నగరి వద్ద ఉన్న పరిశ్రమలకు పామోలిన్ తరలించాల్సి వస్తోంది. అది కూడా ప్రభుత్వమే సూచనలు ఇస్తుందని రైతు శంకర్‌రాజు తెలిపారు. మండలంలోనే పామోలిన్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే మరెంతోమంది సాగుపై మక్కువ చూపుతారన్నారు. కొత్తగా పామోలిన్ సాగు చేయాలనుకునే రైతు తన వివరాలు తెలిపితే రాయితీపై మొక్కలు అందజేస్తామని హార్టికల్చర్ అధికారులు చెబుతున్నారు.


రైతు శంకర్‌రాజు

- కేవీబీపురం, ఆంధ్రజ్యోతి

పోలా.. అదిరిపోలా!


శ్రీకాళహస్తిలో ఆదివారం కలంకారీ వస్త్రాలను ధరించి మురిసిపోతున్న అమెరికన్లు.


యువకుడితో పోలీసులు, అటవీశాఖ సిబ్బంది

సదాశివ కోనలో దారి తప్పిన యువకుడు

- రక్షించిన పోలీసులు

వడమాలపేట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలంలోని సదాశివ కోనకు వెళ్లొస్తుండగా తప్పిపోయిన యువకుడిని సెల్‌ఫోన్ సిగ్నళ్ల ఆధారంగా పోలీసులు రక్షించారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో జరిగింది. చెన్నై నగరం తాంబరానికి చెందిన 20 మంది యువకులు ఆదివారం ఉదయం ఏర్పేడు మండలం చెల్లూరు, పాయల్ సెంటర్ మీదుగా సదాశివకోనకు నడిచి వెళ్లారు. సాయంత్రం తిరిగి వస్తుండగా సదాశివకోన ప్రాజెక్టుకు సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో దినేష్ దారి తప్పాడు. మిగిలిన వారి ఆచూకీ తెలియక ప్రాజెక్టు వద్దకు చేరుకున్నాడు. రాత్రి 8.30 గంటల సమయంలో నెం.100కు ఫోన్ చేశాడు. పుత్తూరు సీఐ రవీంద్ర స్పందించారు. వడమాలపేట ఎస్ఐ ధర్మారెడ్డి, కానిస్టేబుళ్లు సురేష్, డిల్లీబాబును యువకుడిని వెదకడానికి పంపారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా వారు ఆ యువకుడి ఆచూకీ గుర్తించారు. అటవీశాఖ సిబ్బందితో కలిసి బ్యాటరీ లైట్ల సాయంతో యువకుడిని చేరుకున్నారు. అతడిని వారి బృందానికి అప్పగించారు.

సిఫార్సులున్నా గంటల తరబడి నిరీక్షణ

- గదుల కోసం పద్మావతి, ఎంబీసీ వద్ద పడిగాపులు

తిరుమల, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): తెనాలికి చెందిన శ్రీనివాస్ మధ్యతరగతికి చెందిన వ్యక్తి. తిరుమలలో గది కోసం రెండు నెలల పాటు ఓ నాయకుడి చుట్టూ తిరిగి ఎట్టకేలకు సిఫార్సు లేఖ పొందారు. 'హమ్మయ్యా గదికి సమస్య లేదులే' అనుకుని తిరుమల చేరుకున్నారు. ఎంబీసీ34లో గది పొందాలని సూచన చేయడంతో ఉదయం 10 గంటలకు క్యూలైన్‌లోకి వెళ్లిన ఆయనకు.. మధ్యాహ్నం 3 గంటలైనా గది లభించలేదు.

- విజయవాడకు చెందిన మరో భక్తుడు కూడా ఇలానే దాదాపు ఐదు గంటలు నిలబడ్డారు.
- ఇక పద్మావతి విశ్రాంతి గృహంలోనూ ఉదయం క్యూలైన్‌లోకి వెళ్లే వారికి మధ్యాహ్నమైనా గదులు దొరకలేదు.

తిరుమలలో సాధారణంగా ఎలాంటి సిఫార్సుల్లేని భక్తులు సీఆర్వోలో గదులు పొందుతారు. ఇక రాజకీయ, వివిధ రాజ్యాంగహోదాలో ఉన్నవారైతే నేరుగా గదులు, దర్శనాలు పొందుతున్నారు. క్యూలైన్‌లో నిలబడలేక, హైలెవల్‌లో సౌకర్యాలు పొందలేక ఏదో తమకు తెలిసినవారి ద్వారా సిఫార్సు లేఖలు తీసుకొచ్చే మధ్య తరగతి భక్తులు మాత్రం అగచాట్లు పడుతున్నారు. ముఖ్యంగా సిఫార్సు లేఖలపై గదులు కేటాయించే పద్మావతి, ఎంబీసీ34 వద్ద భక్తులు గదుల కోసం గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సివస్తోంది. పిల్లలు, వృద్ధులు, లగేజీలతో ఈరెండు కౌంటర్ల వద్ద తిండితిప్పలు లేకుండా నిరీక్షిస్తున్నారు. దాదాపు పద్మావతి, ఎంబీసీ పరిధిల్లో దాదాపు 1,600 గదులు అందుబాటులోకి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు నిర్వహణ లోపంతో భక్తులు గంటల కొద్దీ నిలబడాల్సి వస్తోందనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల దర్శన టికెట్లు ఉన్నవారికే గదులు అనే విధానాన్ని అమలుచేయడంతో వారం పదిరోజుల పాటు గదులన్నీ మిగిలిపోయాయి. ఆ తర్వాత ఉన్నతాధికారుల మందలింపుతో తిరిగి సిఫార్సు లేఖలపై గదులు కేటాయించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఇలా రిసెప్షన్ విభాగంలో సరైన నిర్వహణ లేకపోవడంతో వసతి విషయంలో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వసతి కల్పనపై దృష్టిసారించాల్సి ఉంది.


పద్మావతి వద్ద నిరీక్షిస్తున్న భక్తులు


ఎంబీసీ వద్ద గదుల కోసం ఇక్కట్లు

సర్వదర్శనానికి 16 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 29 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

గురువారం నాటి హుండీ ఆదాయం: రూ.3.44 కోట్లు
శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,411
తలనీలాలు సమర్పించినవారు: 27,677

ఘనంగా శారదాదేవి జయంతి



పాకాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణ మందిరంలో రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో శారదాదేవి 172వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం శారదాదేవి అష్టోత్తర నామార్చన, లలితా సహస్రనామార్చన, విశేష పూజ చేశారు. మధ్యాహ్నం భక్తులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ ఎన్‌సి రామచంద్రారెడ్డి, కార్యదర్శి మేజర్ పి.రవినాయుడు, ఎన్.పరంధామ నాయుడు, సి.గురవయ్యనాయుడు, ఆనందాచారి, దొరస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



తిరుచానూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం కళాకారుల నృత్యరూపకం అలరించింది. నెల్లూరుకు చెందిన గురుకృప కళాక్షేత్రం వారు.. చరిత, పూజ, మోక్షిత, పావని, లహరి, దీక్షిత, బాలమ్మ తదితరులు పలు కీర్తనలకు నృత్యం చేశారు. వీరిని ఏవో ఖాదరవల్లి సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

వైసీపీ ఆరోపణలు అవాస్తవం: టీడీపీ

భాకరాపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నేత భూపాల్‌కు చెందిన మామిడి చెట్లను టీడీపీ నేతలు నరికేసి, కంచె విరిచేశారని చేసిన ఆరోపణలు అవాస్తవమని టీడీపీ మండలాధ్యక్షుడు బెల్లంకొండ మురళి అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొంతమంది రైతుల భూ సమస్యను పార్టీలపై రుద్దడం వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మోహిత్ రెడ్డికి తగదన్నారు. టీడీపీ జిల్లా కార్యదర్శి ఆర్వీ రమణారెడ్డి మాట్లాడుతూ భూములు ఆక్రమించడం, దాడులు చేయడం తమ సంస్కృతి కాదన్నారు. గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలను వైసీపీ వారికి ఇచ్చుకోవడంపై విచారణ జరిపించాలన్నారు. అనంతరం పోలీసు స్టేషన్‌కు వెళ్లి వైసీపీ నేత, అతని అనుచరులపైన ఫిర్యాదు చేశారు. టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, దామోదర, లోకనాథం, మల్లికార్జునరెడ్డి, డిష్ మణి, యశ్వంత్, దాసరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇల్లు తొలగింపుపై ఫిర్యాదు

పాకాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తన ఇల్లు తొలగించారని మండలంలోని మొగరాలరెడ్డివారి వీధికి చెందిన రెడ్డెమ్మ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒంటరి మహిళనైన తాను తాతల కాలం నుంచి వస్తున్న స్థలంలో కొన్నేళ్లుగా రేకుల ఇంట్లో నివాసం ఉంటున్నానని చెప్పారు. గెనుముగట్టుపల్లెకు చెందిన కృష్ణయ్య, ఆయన కుటుంబీకులు ఆ స్థలం తమదంటూ తొలగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, కృష్ణయ్య, ఆయన కుటుంబ సభ్యులను బైండోవర్ చేసి, హెచ్చరించి పంపారు.

అష్టలక్ష్మి ఉత్సవాల్లో కేంద్ర మంత్రి



రామచంద్రాపురం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సి.రామాపురం సిద్ధేశ్వరతీర్థంలో జరుగుతున్న అష్టలక్ష్మి ఉత్సవాల్లో కేంద్ర న్యాయశాఖ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘువాల్ ఆదివారం పాల్గొన్నారు. సనాతన హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆశ్రమ పీఠాధిపతి బ్రహ్మర్షి గురవానంద ప్రవచనాలను బోధించారు. కేంద్రమంత్రిని సత్కరించి, అష్టలక్ష్మి విగ్రహాన్ని అందజేశారు. ఆదివారంతో అష్టలక్ష్మి ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో తహసీల్దారు వెంకటరమణ పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు




మంచు విష్ణు

తిరుమల, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఎంపీ తనూజారాణి, సినీహీరో మంచు విష్ణు, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వివేక్ కుమార్ బిర్లా, బాంబే హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దేబద్వార్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

జీఎన్సీ నూతన ఉపవిచారణ కార్యాలయం ప్రారంభం



తిరుమల, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనానికి వచ్చే సామాన్య భక్తులు తిరుమలలో సులభంగా వసతి పొందేలా చర్యలు చేపట్టినట్టు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. జీఎన్సీ(గరుడాద్రి నగర్ కాటేజీ) వద్ద ఆధునికీకరించిన నూతన ఉప విచారణ కార్యాలయంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఆయన పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ.. సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా తిరుమలలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అందులో భాగంగా తిరుమలలోని అన్ని వసతి గదులు, విశ్రాంతి గృహాల వద్ద సర్వే నిర్వహించి మెరుగైన సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. 42 ఉప విచారణ కార్యాలయాలను ఆధునికీకరిస్తున్నట్లు తెలిపారు. గదుల కరెంట్ బుకింగ్‌లో కేంద్రీయ విచారణ కార్యాలయంపై అధిక భారం పడుతుండటంతో వికేంద్రీకరించినట్టు అదనపు ఈవో వెంకయ్య చౌదరి చెప్పారు. ఉప విచారణ కార్యాలయాల వద్ద గదులు పొందడం, ఖాళీ చేయడం సులభతరమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జేఈవో గౌతమి, సీవీఎస్వో శ్రీధర్, రిసెప్షన్ డిప్యూటీఈవో ఆర్2 హరీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి అడ్వెంచర్ అడిక్ట్స్ టీమ్ ప్రతి సండే ట్రెక్కింగ్ క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం తిరుపతి, చెన్నై, బెంగళూరు నుంచి దాదాపు 30మందికి పైగా ట్రెక్కర్స్ చంద్రగిరి నుంచి అడివిలోకి ప్రవేశించి ఒక మెగాలిత్ ట్రెక్కింగ్ కార్యక్రమం నిర్వహించారు. దీని వల్ల కలిగే ప్రయోజనాలు మరిన్ని సరదా కార్యకలాపాలను ప్రతి ఆదివారం ఆస్వాదిస్తున్నారు. - తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

పారిశుధ్య పనులు వేగవంతం



రామచంద్రాపురం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నడవలూరు గ్రామంలో సర్పంచ్ గణపతిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువలను శుభ్రం చేసి, బ్లీచింగ్ చల్లారు. తాగునీటి ట్యాంకులో క్లోరినేషన్ చేయించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. గ్రామంలో విషజ్వరాల అదుపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సర్పంచ్ అవగాహన కల్పించారు.

వన్నెకుల క్షత్రియులు ఆర్థిక వృద్ధి సాధించాలి

- ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి



సమావేశంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ రాజన్, డైరెక్టర్లు

తిరుపతిరూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వన్నెకుల క్షత్రియులు సామాజికంగా, ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధించాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కోరారు. ఎమ్మార్‌పల్లిలోని యూత్ హాస్టల్‌లో వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అయ్యంగారు బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఆదివారం వన్నెకుల క్షత్రియుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వన్నె కులస్తులు తమ కుటుంబానికి అండగా ఉంటున్నారని తెలిపారు. టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని వన్నెకుల క్షత్రియులను అభివృద్ధి దిశగా నడిపించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ సీఆర్ రాజన్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం వన్నెకుల క్షత్రియులను నిర్లక్ష్యం చేసిందని, కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉన్నతికి కృషి చేస్తోందని తెలిపారు. కార్పొరేషన్ డైరెక్టర్లు బాలసుబ్రమణ్యం, తేజోవతి మాట్లాడుతూ వన్నెకుల క్షత్రియులు విద్య, ఆర్థికాభివృద్ధి దిశగా అడుగులు వేయాలన్నారు. అనంతరం సీఆర్ రాజన్‌తో పాటు 15మంది డైరెక్టర్లను సన్మానించారు. వన్నెకుల క్షత్రియ నేతలు మునికృష్ణారెడ్డి, జానకిరామిరెడ్డి, కోబాకు ధనంజయరెడ్డి, వెంకటముని, శ్రీరాములు, ఉమాపతి, కిరీటిరెడ్డి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పాకాలలో ఘనంగా పెన్షనర్ల దినోత్సవం



పెన్షనర్ల దినోత్సవంలో మాట్లాడుతున్న మునస్వామి

పాకాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం పాకాల యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం అఖిల భారత పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సంఘ అధ్యక్షుడు పీఆర్ మునస్వామి అధ్యక్షతన ప్రభుత్వ బాలికల కళాశాల ఆవరణలో నిర్వహించిన ఈ సమావేశంలో సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు కెఆర్.శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.జయరామనాయుడు, కార్యదర్శి ఎ.కృపావరమ్మ, జిల్లా కోశాధికారి సిద్ధయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు జి.అంజినేయులు ముఖ్య అతిథులుగా పాల్గొని పెన్షనర్ల సమస్యలపై చర్చించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు, 12వ పీఆర్సీ వెంటనే ఏర్పాటు చేయాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. 25 మంది సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమంలో పాకాల యూనిట్ కార్యదర్శి కుప్పుస్వామినాయుడు, కోశాధికారి రామ్మూర్తి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గణిత ప్రతిభా పరీక్షకు స్పందన



పరీక్షను పర్యవేక్షిస్తున్న విశ్వచందన్‌రెడ్డి

తిరుపతి(గాంధీరోడ్డు), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తిరుపతికి చెందిన విశ్వం పోటీ పరీక్షల శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని 5 నుంచి 8 తరగతులు చదివే విద్యార్థులకు గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. తిరుపతి, పుత్తూరు, నగరి, శ్రీకాళహస్తి కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 5వేల మంది విద్యార్థులు హాజరైనట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. సైనిక్, నవోదయ, మిలటరీ స్కూల్స్ ప్రవేశ పరీక్షను దృష్టిలో ఉంచుకుని ఈ పరీక్ష నిర్వహించామని తెలిపారు. అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న సేవలో పెద్ద జియ్యర్



చంద్రగిరి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి) : శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామిని ఆదివారం పెద్దజియ్యర్ స్వామి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు, అర్చకులు స్వాగతం పలికి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, జమేదార్ చిరంజీవి పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో ఉద్యోగుల ఘర్షణ

షిఫ్ట్ ఆపరేటర్‌కు గాయాలు

కోట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కోట సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌కో ఉద్యోగుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక సబ్ స్టేషన్‌లో గూడూరుకు చెందిన కిరణ్‌కుమార్ షిఫ్ట్ ఆపరేటర్‌గా, కోట మండలం లక్ష్మక్కకండ్రిగకు చెందిన చంద్రయ్య సహాయకుడిగా పనిచేస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున వీరిద్దరి మధ్య గొడవ జరిగింది. ఆగ్రహానికి గురైన చంద్రయ్య ఇనుప రాడ్‌తో కిరణ్‌కుమార్‌పై దాడి చేయడంలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించి కేసు విచారిస్తున్నట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

గణిత పరిశోధనల్లో నూతన ఆవిష్కరణలు చేయాలి

జాతీయ సదస్సులో వక్తల ఆకాంక్ష



సావనీర్ విడుదల చేస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సమాజ అవసరాలకనుగుణంగా గణితంలో నూతన ఆవిష్కరణలు చేయాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. గణిత శాస్త్రం - అనువర్తనాలు అంశంపై ఎస్వీ యూనివర్సిటీ గణిత విభాగం ఆధ్వర్యంలో ఆదివారం రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. సెనేట్ హాల్లో నిర్వహించిన ప్రారంభ సభలో ఇన్‌చార్జి వీసీ అప్పారావు మాట్లాడుతూ గణిత శాస్త్ర పరిశోధకులు శ్రీనివాస రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ గణిత విభాగం బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. మరింత కృషి చేయడం ద్వారా గుర్తింపును సంతరించుకోవాలన్నారు. వరంగల్ నిట్ ప్రొఫెసర్ రాధాకృష్ణమాచార్య మాట్లాడుతూ ఇప్పటివరకూ గణితంలో జరిగిన పరిశోధనలను సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గణిత విభాగాధిపతి జయ సుబ్బారెడ్డి, రిటైర్డు ప్రొఫెసర్ భాస్కరరెడ్డి, ప్రొఫెసర్లు సుధాకరయ్య సుగుణమ్మ, భారతి పాల్గొన్నారు.

నాట్య కళా వారసత్వాన్ని పరిరక్షించుకోవాలి



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్ శిరీష

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మన ప్రాచీన భారతీయ నాట్య కళా వారసత్వాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత ఈతరంపై ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. శ్రీకృష్ణ నటరాజాలయం ఆధ్వర్యంలో తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో రెండు రోజుల భారత్ నాట్యోత్సవం ఆదివారం ప్రారంభమైంది. ప్రారంభ సభలో మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ.. మన కళలు మన దేశ గొప్పదనాన్ని తెలియచేస్తాయన్నారు. కూచిపూడి, భరతనాట్యం, కథక్, ఒడిస్సీ వంటి భారతీయ నృత్య రీతులు ఆయా రాష్ట్రాల కళా వైభవానికి ప్రతీకలని తెలిపారు. టీటీడీ విశ్రాంత ఉద్యోగి చిన్నంగారి రమణ మాట్లాడుతూ.. మరుగుపడుతున్న ఎన్నో నాట్య కళలను వెలికి తీసి భావితరాలకు అందించాలని కోరారు. కళలు, కళాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ నేత ఊకా విజయ్‌కుమార్ అన్నారు. డీసీసీబీ మాజీ అధ్యక్షుడు అమాస రాజశేఖర్‌రెడ్డి, అవిలాల మాజీ ఎంపీటీసీ కురకాల్వ సుధాకర్, టీటీడీ ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తదితరలుఉ ప్రసంగించారు. నృత్య ప్రదర్శనలు అలరించాయి. నిర్వాహకులు కొండా రవి, సత్యనారాయణ, సాయినాథ్, కళాకారులు, పాల్గొన్నారు.









సామాజిక పురోభివృద్ధిలో టీచర్లు కీలకం

- యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

తిరుపతి(గాంధీరోడ్డు), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సామాజిక పురోభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. కచ్చపి ఆడిటోరియంలో ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు అధ్యక్షుడు జీజే రాజశేఖర్ అధ్యక్షతన ఆదివారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల భవితకు టీచర్లు పునాది వేస్తున్నారని తెలిపారు. ప్రాథమిక స్థాయి నుంచి ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావడానికి టీచర్లు ప్రత్యేక శ్రద్ధ, చొరవ తీసుకోవాలని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల విద్యావ్యవస్థ చిన్నాభిన్నమయ్యే పరిస్థితి ఏర్పడిందని, కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం తగ్గిపోతోందని వాపోయారు. అనేక పాఠశాలలు మూతపడి ఏకోపాధ్యాయ పాఠశాలలుగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రాథమిక స్థాయిలో పాఠశాలలు కనుమరుగయ్యే పరిస్థితి వచ్చిందని, ప్రభుత్వ విధానాలను ఎండగట్టి పాఠశాలల బలోపేతానికి టీచర్లు ఐక్యంగా కృషి చేయాలని కోరారు. జిల్లా విద్యా శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శేఖర్ మాట్లాడుతూ విద్యావ్యవస్థలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని టీచర్లు అందిపుచ్చుకోవాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యాబోధనకు ఆటంకం కలిగించే యాప్‌లను రద్దుచేసి, టీచర్లను బోధనకే పరిమితం చేయాలని కోరారు. అంతకుముందు ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి కచ్చపి ఆడిటోరియం వరకు ర్యాలీ నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్ఎస్ నాయుడు, నవకోటేశ్వరరావు, జీవీ రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ముత్యాలరెడ్డి, నాయకులు నిర్మల, మణికంఠ, బండి మధుసూదన్‌రెడ్డి, సీఐటీయూ నేత కందారపు మురళి, జనవిజ్ఞాన వేదిక నేత బిర్లానాయుడు, టీటీడీ ఉద్యోగ సంఘ నాయకులు నాగార్జున పాల్గొన్నారు.



విద్యేశతీర్థ స్వామి

అమ్మవారి సేవలో ప్రముఖులు



జస్టిస్ చల్లా గుణరంజన్

తిరుచానూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని ఆదివారం ఉదయం ఉడిపి భండారుకేరి మఠం పీఠాధిపతి విద్యేశతీర్థస్వామి తన శిష్యబృందంతో దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ చల్లా గుణరంజన్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకోగా, వేదపండితులు ఆశీర్వదించి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు. ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ తేళ్ల ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు, చలపతి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఇంట్లోకి నాగుపాము



తిరుమల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల బాలాజీనగర్‌లోని మొదటిలైన్ 68వ నెంబరు ఇంట్లోకి ఆదివారం సుమారు నాలుగు అడుగులనాగుపాము ప్రవేశించింది. పామును గుర్తించిన మహిళ భయంతో బయటకు పరుగులు తీశారు. టీటీడీ ఫారెస్ట్ విభాగం వారు వచ్చి పామును పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు.

రాయలపురంలో జల్లికట్టు

- పలువురికి తీవ్ర, స్వల్ప గాయాలు



చంద్రగిరి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలో సంక్రాంతి సందడి మొదలైంది. రాయలపురంలో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. రాయలపురంతో పాటు పరిసర గ్రామాల నుంచి రైతులు తమ పశువులను తీసుకొచ్చారు. వాటి కొమ్ములు చెలిగి, నాయకులు, సినీనటులు, దేవుళ్ల ఫోటోలు, రంగు కాగితాలు అంటించిన చెక్క పలకలు, నగదు, విలువైన వస్తువులను కట్టారు. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో నడివీధిలో పశువులను గుంపులు గుంపులుగా వదిలారు. కోడెగిత్తలను నిలువరించేందుకు అల్లె అవతల నిలబడి యువకులు పోటీ పడ్డారు. పశువులను నిలువరించే క్రమంలో యువకులు వాటి కింద పడటంతో పదిమందికి పైగా తీవ్ర.. పలువురికి స్వల్పగాయాలయ్యాయి. పశువులను నిలువరించి చెక్క పలకలను చేజిక్కించుకున్న యువకులు కేరింతలు కొట్టారు. చెక్కపలకలను చేజిక్కించుకోవడంలో యువకుల మధ్య కొంత ఘర్షణ వాతావరణం నెలకొంది. జల్లికట్టుకు ముందస్తుగా పోలీసుల అనుమతి లేకపోవడంతో గ్రామంలో యువకులు తమ గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జల్లికట్టును నిర్వహిస్తామని చెప్పడంతో పోలీసులు అనుమతించారు. సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐలు అనిత, రవీంద్రనాయక్, పోలీసులు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



ఘాట్‌లో హెల్మెట్‌లేని వాహనదారులకు జరిమానా

తిరుమల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌లో హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు ఆదివారం జరిమానా విధించారు. హెల్మెట్‌ను తప్పనిసరిగా వినియోగించాలంటూ వారంరోజులుగా తిరుమల ట్రాఫిక్ పోలీసులు విస్తృత ప్రచారం చేశారు. ఆదివారం తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లే రెండో ఘాట్‌లో వినాయకస్వామి ఆలయం వద్ద తిరుమల ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్, సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేశారు. వందకుపైగా ద్విచక్రవాహనదారులకు జరిమానాలు విధించి రూ.26,185పైగా వసూలు చేశారు. అనంతరం వాహనదారులకు సీఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. తిరుమల రెండు ఘాట్లలో వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు వినియోగించాలని సూచించారు. ఇకపై తనిఖీలు కొనసాగుతునే ఉంటాయన్నారు.



ద్విచక్రవాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మైదానంలో ఈనెల 27నుంచి జరగనున్న రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు 48 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఆదివారం శ్రీనివాస క్రీడా సముదాయంలో జిల్లా స్థాయి జూడో పోటీలు హోరాహోరీగా జరిగాయి. సబ్ జూనియర్ విభాగంలో బాలురు, బాలికలు 9మంది చొప్పున, క్యాడెట్ విభాగంలో బాలురు, బాలికలు 8 మంది చొప్పున, సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ విభాగంలో ఏడుగురు చొప్పున అర్హత సాధించారు. జూడో సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి, కార్యదర్శి జగదీష్ క్రీడాకారులను అభినందించారు.

మారుతున్న చట్టాలపై అవగాహన అవసరం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు



సదస్సును ప్రారంభిస్తున్న న్యాయమూర్తి మన్మథరావు

తిరుపతి అర్బన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మారుతున్న పన్ను చట్టాలు, ఆచరణపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, ఈ మేరకు ప్రత్యేక సదస్సు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె.మన్మథరావు అన్నారు. ఆర్టీసీ సెంట్రల్ బస్టేషన్ ఎదురుగా ఉన్న ఓ హోటల్లో ఆదివారం ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ జిల్లా, నగర కార్యవర్గం ఆధ్వర్యంలో ఒకరోజు దక్షిణాది జాతీయ పన్నుల సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ మన్మథరావు సెక్షన్ 62, 73, 74 కింద ధ్రువీకరణ చేయాల్సినవి, చేయకూడనవి, రియల్ ఎస్టేట్ లావాదేవీలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌పీ జాతీయ అధ్యక్షుడు నారాయణ, ఏపీ, తెలంగాణ టీపీసీఏ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, నర్సింగరావు, ఏపీ ట్యాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వి.జె.కె.కుమార్, తిరుపతి ప్రతినిధులు నాగభూషణ్, పి.పద్మనాభం, చంద్ర, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

శిల్పారామం వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



మందులు పంపిణీ చేస్తున్న పీసీ రాయలు

తిరుపతి (ఆటోనగర్), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : శిల్పారామం వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ పీసీ రాయలు, అధ్యక్షుడిగా ఎంఎల్ నాయుడు, కార్యదర్శిగా విజయ్, కోశాధికారిగా రమణ ఎన్నికయ్యారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి రెడ్డెప్ప ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. 100 మంది సభ్యులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం పీసీ రాయలును సభ్యులు సన్మానించారు.

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

అఖిలపక్ష నేతల డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తిరుపతి (ఆటోనగర్), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ సాక్షిగా అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షాను హోంమంత్రి పదవి నుంచి తొలగించాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సీపీఎం అనుబంధ సంఘాలు ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు వి.నాగరాజు, పి.అంజయ్య, నగేష్, సి.కాళయ్య, జి.బాలసుబ్రమణ్యం, డీఎంసీ భాస్కర్ మాట్లాడుతూ జాతీయ జెండాను ఆవిష్కరించుకోవడం అరిష్టమని గతంలో చెప్పిన బీజేపీ నాయకులు ప్రస్తుతం దేశభక్తి గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రధాని మోదీ రాజ్యాంగం ద్వారానే తాను ప్రధాన మంత్రి అయ్యాను అని చెబితే పార్లమెంట్‌లో అదే రాజ్యాంగాన్ని హోంమంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో అవమానపరిచే విధంగా మాట్లాడితే సమర్థించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అమిత్‌షాపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు వేణుగోపాల్, టి.సుబ్రమణ్యం, బుజ్జి, జయంతి, నరేంద్ర, రాజు, రవి, అక్బర్ పాల్గొన్నారు.

స్కావెంజర్స్ కాలనీలో కార్డన్ సెర్చ్

21 ద్విచక్రవాహనాల స్వాధీనం



తనిఖీలు చేస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్కావెంజర్స్ కాలనీలో ఆదివారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ ప్రాంతం నుంచి కేసుల సంఖ్య పెరుగుతుండడంతో అన్ని ఇళ్లలో తనిఖీలు చేశారు. ఆధార్, రేషన్ కార్డులను పరిశీలించారు. ఒక్కసారిగా వందలాది మంది పోలీసులు వచ్చి తనిఖీలు చేస్తుండడంతో అక్కడివారు ఆశ్చర్యపోయారు. డీఎస్పీ వెంకటనారాయణ దగ్గరుండి వారికి పరిస్థితి వివరించారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా ఉన్నారా అని ఆరా తీశారు. అనుమానితులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. రికార్డులు, లైసెన్సులు లేని 21 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు.

అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ ఏర్పాటు చేయాలి



సమావేశంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనూ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని ఆ వర్సిటీ తిరుపతి కేంద్రం అధ్యాపకులు, బోధనేతర ఉద్యోగులు, విద్యార్థులు కోరారు. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలోని అంబేడ్కర్ వర్సిటీ స్టడీ సెంటర్ వద్ద ఆదివారం సమావేశమై చర్చించారు. 2024-25 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ, డిప్లొమో అడ్మిషన్లు చేపట్టారని తెలిపారు. యూజీసీ సూచన మేరకు మన రాష్ట్రంలోనూ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలన్నారు. లేకపోతే విలువైన కాలాన్ని విద్యార్థులు కోల్పోయే అవకాశం ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్మిషన్లు పొందిన విద్యార్థుల్లో 90 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులే ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ వేణుగోపాలరెడ్డి, అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ తిరుపతి కేంద్రం కో-ఆర్డినేటర్ మల్లికార్జునరావు, సిబ్బంది కల్యాణి, బాషా పాల్గొన్నారు.

వాకర్స్‌కు మధుమేహంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

తిరుపతి(జీవకోన), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి లయన్స్ క్లబ్ శ్రీశ్రీనివాస ఆధ్వర్యంలో వినాయకసాగర్ వాకర్స్ అసోసియేషన్ సహకారంతో ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి వైద్యులు ఆదివారం మధుమేహంపై వాకర్స్‌కు అవగాహన కల్పించారు. వారికి రక్త పరీక్షలు చేశారు. ప్రతి ఒక్కరూ రెండు మూడు నెలలకు ఒకసారి పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ సాయిరాం తేజ్ సూచించారు. తిరుపతి లయన్స్ క్లబ్ శ్రీశ్రీనివాస అధ్యక్షుడు అర్కాట్ కృష్ణ ప్రసాద్, కార్యదర్శి జగన్నాథం, రఘు, శాంతి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలాజీనాయుడు, కార్యదర్శి శివారెడ్డి, కోశాధికారి సాయి, కృష్ణంరాజు, నరసింహయ్య, రామస్వామి పాల్గొన్నారు.

రౌడీ పనులు చేస్తే కఠిన చర్యలు



రౌడీలకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ వెంకటనారాయణ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో అల్లర్లు, రౌడీయిజం, దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెంకటనారాయణ హెచ్చరించారు. ఎస్వీయూ స్టేడియంలో ఆదివారం ఈస్ట్, వెస్ట్ సీఐ రామకృష్ణ తిరుపతిలోని రౌడీలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో నడుచుకోవాలని కోరారు. కదలికలపై నిరంతర నిఘా ఉంటుందని పేర్కొన్నారు. రెండుసార్లు రౌడీయిజానికి పాల్పడితే అరెస్టు చేస్తామన్నారు. అనంతరం రౌడీయిజానికి పాల్పడమని వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నాలుగు స్టేషన్ల ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టించుకోండి సారూ..



నగర పరిధిలోని కాటన్‌మిల్ మీదుగా పూలవానిగుంటకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయమైంది. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరుచేరి వాహన రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయి. గుంతలను గుర్తించలేక ఇప్పటికే పలువురు గాయాలపాలయ్యారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయాల్సి ఉంది.

- తిరుపతి వైద్యం, (ఆంధ్రజ్యోతి)



నగర పరిధిలోని ఉపాధ్యాయనగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డులో కాలువ సైడ్‌వాల్ గతంలో కురిసిన వర్షాలకు పడిపోయింది. మూడు నెలలు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రాత్రి సమయాల్లో ఏమరపాటుగా వెళ్లే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించాల్సి ఉంది.

- తిరుపతి జీవకోన, (ఆంధ్రజ్యోతి)



తిరుపతి రూరల్ మండలం పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి నుంచి వేదాంతపురం గ్రామ పంచాయతీలోని తెలుగుతల్లి ఆశ్రమం, రామదాస్ కాలనీకి వెళ్లే మట్టి రోడ్డు మార్గంలో ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు చేరి, రొచ్చురొచ్చుగా తయారైంది. ఈ మార్గంలో ప్రయాణించే వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందిపడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సిమెంటు రోడ్డు ఏర్పాటు చేయాలని పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే పులివర్తి నానీ నిధులు మంజూరు చేయించారని, త్వరలోనే పనులు చేపడతామని స్థానిక నేతలు చిరంజీవిరెడ్డి, పరంధామయాదవ్, చంద్రముదిరాజ్, శ్యామ్‌బాబు అంటున్నారు.

- తిరుపతిరూరల్ (ఆంధ్రజ్యోతి)



డీబీఆర్ రోడ్డులోని ప్రభుత్వ పాఠశాల, శ్రీకన్వెన్షన్ హాల్ ఎదురుగా సైడు కాలువ కూలిపోయింది. మురుగునీరు, వ్యర్థాలు ఆ ప్రాంతంలో నిల్వ ఉంటూ దుర్గంధం వెదజల్లుతున్నాయి. సమీపంలో ప్రభుత్వ పాఠశాల ఉండడంతో విద్యార్థులు ముక్కు మూసుకుని పాఠాలు వినాల్సి వస్తోంది. కాలువను పునర్నిర్మించాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

- తిరుపతి అర్బన్, (ఆంధ్రజ్యోతి)



కరకంబాడీ రోడ్డు నుంచి ఉపాధ్యాయనగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు చివరి వరకు అటవీ ప్రాంతానికి అనుకుని ఫెన్సింగ్ ఉండేది. ప్రస్తుతం ఆ ఫెన్సింగ్ అక్కడక్కడ దెబ్బతినడంతో ఇబ్బందిగా మారింది. అటవీ ప్రాంతం కావడంతో పందుల బెడద ఎక్కువైంది. జంతువులు గృహాల వైపు వస్తున్నాయి. అటవీశాఖ అధికారులు స్పందించి రోడ్డు పొడవునా పూర్తిస్థాయిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- తిరుపతి జీవకోన, (ఆంధ్రజ్యోతి)

'సీఎం చంద్రబాబుపై విమర్శలు విడ్డూరం'

తిరుపతి(లీలామహల్), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుపై తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని కార్పొరేటర్ అన్నా అనితయాదవ్ విమర్శించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ కూటమి పాలనలో రాష్ట్రం ప్రశాంతంగా ఉందన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజలు భయాందోళనతో బతికారని పేర్కొన్నారు. దేశంలో ఏ పార్టీ దోచుకోని విధంగా వైసీపీ దోచుకుందన్నారు. 11 సీట్లే వారి పాలనకు నిదర్శనమని, తిరుపతిలో టీడీఆర్ బాండ్లలో చేతివాటంపై ప్రదర్శించారని విమర్శించారు. భూమన ఆరోపణలను ప్రజలు నమ్మరనే విషయాన్ని గుర్తించాలన్నారు. సమావేశంలో శంకర్ యాదవ్, శ్రీరాములు, శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభయ క్షేత్రం పిల్లలకు అన్నదానం



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి ట్రాఫిక్ పోలీసులు రేణిగుంట అభయక్షేత్రంలోని అనాథ పిల్లలకు అవసరమైన సామగ్రి, ఆహార పదార్థాలు, స్వీట్లు, స్నాక్స్ ఆదివారం అందజేశారు. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి ఆదేశాలతో సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది కలసి ప్రత్యేక వంట పాత్రల్లో తీసుకెళ్లి అభయక్షేత్రం నిర్వాహకులకు భోజనం అందజేశారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తాము సంపాదించే డబ్బులో ఎంతో కొంత పేదలు, అనాథలు, దివ్యాంగులకు ఇవ్వాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిని సత్కరిస్తున్న ఉద్యోగులు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారానికి జిల్లాలోని బీసీ ఉద్యోగులు సంఘటితం కావాల్సిన అవసరముందని బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.గోపాల్ అన్నారు. తిరుమల బైపాస్ రోడ్డులోని బీసీ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని మండలాల్లో కమిటీలు ఏర్పాటు చేసి, సంఘాన్ని పటిష్టం చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు. ఏబీసీ సర్టిఫికెట్ల కోసం ఎదురవుతున్న ఇబ్బందులపై పోరాటాలు చేస్తామన్నారు. అనంతరం ప్రధాన కార్యదర్శి బి.భాస్కర్ యాదవ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో జి.ప్రసాద్, బాలసుబ్రమణ్యం, వాసుదేవయ్య, రామ్మోహన్, విజయకుమార్, నాగరాజు, వినోద్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

తిరుపతి జిల్లా బీసీ ఉద్యోగుల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సురేష్‌బాబు, అధ్యక్షుడిగా గణేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా వి.పవన్, కోశాధికారిగా సునీల్‌దత్, ఉపాధ్యక్షులుగా కె.బాలసుబ్రమణ్యం, మధుసూదన్, వాసుదేవయ్య, రామ్మోహన్, మహిళా కార్యదర్శిగా నాగలక్ష్మి, అదనపు కార్యదర్శులుగా లత, వనజ, సునీత, జిల్లా కార్యదర్శులుగా జి.మోహన్, ఏ వినోద్, విజయకుమార్, శేఖర్, దశరథయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

దివ్యాంగులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న మధుబాబు

తిరుపతి అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): 65వ ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బాబుజగ్జీవన్‌రామ్ భవనంలో ఆదివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రెడ్డెయ్య ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిన మధుబాబు అన్నదానం చేశారు. ఆయన మాట్లాడుతూ డొక్కా సీతమ్మ స్ఫూర్తితో దివ్యాంగులకు అన్నదానం చేయడం సంతృప్తిగా ఉందన్నారు.


రజక వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి కృషి



మధు, చంద్రలను సన్మానిస్తున్న రజక సంఘ నేతలు

తిరుపతి(జీవకోన), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రజక వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రజక రాష్ట్ర డైరెక్టర్లు మధు, కరాటే చంద్రలు అన్నారు. రజక కార్పొరేషన్ డైరెక్టర్లుగా ఎన్నికైన ఆ ఇద్దరిని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం తిరుపతి జిల్లా కమిటీ నేతలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రజకులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మనపల్లె మునిరత్నం, గండికోట ఈశ్వరయ్య, గండికోట నాగరాజ, కవిలి నాగరాజ, ఎం.రాధాకృష్ణ, కరకంబాడి శీను, రమణ, నాగరాజు, చైతన్య, జీవకోన రజక సంఘం అధ్యక్షులు సుధాకర్ పాల్గొన్నారు.

అన్నమయ్య ఇంటి నిర్మాణంపై తీర్మానం చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న విజయశంకరస్వామి

తిరుపతి (లీలామహల్), డిసెంబరు22 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో కూల్చేసిన అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించేందుకు టీటీడీ పాలకమండలిలో తీర్మానం చేయాలని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి కోరారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన జరగనున్న పాలకమండలి సమావేశంలో అన్నమయ్య ఇల్లు, అన్నమయ్య, హనుమంతుని విగ్రహాల పునర్నిర్మాణంపై సమీక్షించాలన్నారు. అనుబంధ క్షేత్రాల్లో హరినామ సంకీర్తన జరగాలని, గురువులకు రూ.10వేల గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. సమావేశంలో స్వప్న, చంద్రకళ, అనిషా, రజని, దేవానంద్, నారాయణ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ గణిత విభాగంలో గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. గణిత శాస్త్రానికి ఆయన చేసిన సేవను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ వీసీ సరోజమ్మ, ప్రొఫెసర్ లీలారత్నం, మ్యాథ్స్ హెడ్ వెంకటలక్ష్మి, డాక్టర్ విశాలి పాల్గొన్నారు.

ఆలిండియా ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా లక్ష్మీపతి



మంగళం, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి) : ఏపీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.లక్ష్మీపతి ఆలిండియా ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం న్యూఢిల్లీలో జరిగిన అఖిల భారత అటవీ అధికారుల సమాఖ్య సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు ఎన్నుకున్నారు. జాతీయ జాయింట్ కార్యదర్శిగా పరమేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒకే దేశం, ఒకే పని, ఒకే వేతనం, ఒకే యూనిఫాం నినాదంతో ప్రభుత్వానికి సమస్యలను విన్నవించనున్నట్లు లక్ష్మీపతి తెలిపారు.

నగరపాలక పాఠశాలలో మతప్రార్థనలపై విమర్శలు



తిరుపతి (గాంధీ రోడ్డు), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చెన్నారెడ్డి కాలనీలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో ఆదివారం సాయంత్రం మతపరమైన ప్రార్థనా కార్యక్రమం నిర్వహించడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాలలో పెళ్లిళ్లు, ఫంక్షన్లు, మతపరమైన కార్యక్రమాల నిర్వహణ చేపట్టరాదని ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ ఆదేశించిన విషయం తెలిసిందే. ఇందుకు విరుద్ధంగా అంబేడ్కర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో సెమీ క్రిస్మస్‌కి సంబంధించిన మతపరమైన కార్యక్రమాన్ని నిర్వహించడాన్ని పలువురు విమర్శిస్తున్నారు. కాగా నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు లేదా పాఠశాల నిర్వాహకుల అనుమతి తీసుకునే నిర్వహించారా..? లేదా అన్నది తెలియాల్సి ఉంది. డీవైఈవో బాలాజీని వివరణ కోరగా కార్యక్రమ నిర్వహణ కోసం ఎవరూ తమను సంప్రదించలేదని, అనుమతి కూడా ఇవ్వలేదని అంటున్నారు.

విజయరాజు యాదవ్‌కు డాక్టరేట్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం కామర్స్ విభాగ పరిశోధకులు రాచుగాళ్ల విజయరాజు యాదవ్ డాక్టరేట్ పొందారు. పర్ఫార్మెన్స్ ఎవల్యూషన్ ఆఫ్ సెలెక్ట్ నిఫ్టీ-50 కంపెనీస్ అంశంపై ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. కడప జిల్లా బ్రహ్మంగారి మఠానికి చెందిన విజయరాజు యాదవ్ ప్రస్తుతం హైదరాబాదులో చార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయన తండ్రి రాచుగాళ్ల పెంచలయ్య హెడ్మాస్టర్‌గా పనిచేశారు. తన పరిశోధనా కాలంలో విజయరాజు యాదవ్ పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఆయన రూపొందించిన ఆరు పరిశోధనా వ్యాసాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఎస్వీయూ కామర్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ జయచంద్రారెడ్డి, అధ్యాపకులు, పరిశోధకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

పుత్తూరు వార్తలు

ముగిసిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

ద్వితీయ స్థానంలో చిత్తూరు జిల్లా జట్లు


బాలుర జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్


బాలికల జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్ 19 ఖోఖో పోటీల్లో ప్రకాశం జిల్లా బాలుర, బాలికల జట్లు విజేతలుగా నిలవగా, చిత్తూరు జిల్లా బాలుర, బాలికల జట్లు రెండో స్థానంలో నిలిచాయి. మూడు రోజుల క్రితం 68వ రాష్ట్ర స్థాయి పోటీలు ప్రభుత్వ ఎస్ఆర్ఎస్ జూనియర్ కళాశాల మైదానంలో ప్రారంభమై ఆదివారం ముగిశాయి. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లకు ఎమ్మెల్యే గాలి భనుప్రకాష్ ట్రోఫీలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తున్న క్రీడాకారులకు సీఎం చంద్రబాబు ప్రోత్సాహకాలు అందిస్తున్నారని, క్రీడా కోటాను కూడా మూడు శాతానికి పెంచారని గుర్తు చేశారు. కాగా ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో ప్రకాశం జిల్లా బాలికల జట్టు చిత్తూరు జిల్లా జట్టుపై 14-12 స్కోరుతో విజయం సాధించింది. అలాగే ప్రకాశం జిల్లా బాలుర జట్టు చిత్తూరు జిల్లా జట్టుపై 12-10 స్కోరుతో గెలుపొందింది. దీంతో బాలుర, బాలిక విభాగాల్లో ప్రకాశం జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, చిత్తూరు జిల్లా జట్టు ద్వితీయ స్థానంతో సరిపెట్టుకోవలసి వచ్చింది. ఈ బహుమతి ప్రదానంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, నాయకులు యుగంధర్, ధనపాల్, జనసేన నాయకుడు మహేష్, క్రీడా నిర్వాహకులు జయరామయ్య, బాబు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం


కె.ఎల్.ఎన్ మూర్తి

పుత్తూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.ఎల్.ఎన్ మూర్తి, కార్యదర్శులుగా రఫీఅహమ్మద్, ముని కృష్ణయ్య, ఉపాధ్యక్షుడిగా గోపీకృష్ణ, కోశాధికారిగా గుణశేఖర్‌రెడ్డి తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శ్రీనివాసులురెడ్డి, రవిరాజు, మాధవులునాయుడులు పాల్గొన్నారు.

హోమియో వైద్యంతో రోగాలు నయం

పుత్తూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): హోమియో వైద్యంతో అనేక రోగాలు నయం అవుతున్నాయని, ప్రత్యేకించి దుష్ప్రభావాలు లేవని ఎన్టీఆర్ వైద్య యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారాణి అన్నారు. పట్టణంలోని కేకేసీ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్త్‌సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆదివారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ఇలాంటి ఎగ్జిబిషన్ల వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. హోమియో విద్యార్థులు తయారు చేసిన వివిధ పరికరాలను ఆమె తిలకించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కుప్పయ్యశెట్టి, వైస్‌చైర్మన్ నరసింహారావు, ప్రిన్సిపాల్ శరవణన్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ క్రీడాపోటీల్లో ప్రతిభ

పుత్తూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ బాలుర విభాగంలో పిళ్లారిపట్టు పాలిటెక్నిక్ విద్యార్థి రోహిత్ ఛాంపియన్ షిప్ సాధించాడని ప్రిన్సిపాల్ కుమార్ తెలిపారు. తిరుపతిలో జరిగిన పోటీల్లో ఈసీఈ చదువుతున్న రోహిత్ లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్‌లో ప్రథమ స్థానం, వంద మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచి ఛాంపియన్ షిప్ సాధించాడన్నారు. అలాగే బ్యాడ్మింటన్ డబుల్స్, సింగిల్స్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు, కబడ్డీలో ద్వితీయ స్థానంలో విద్యార్థులు నిలిచారుని తెలిపారు.

22పీటీఆర్ టౌన్3: ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మైనారిటీ నాయకులు

అల్లా దయతో ఆనందంగా ఉండాలి


ఎమ్మెల్యే భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

పుత్తూరు టౌన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): అల్లా దయతో ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఆనంబట్టురోడ్డులో ఉన్న నాగూర్ ఖాదర్ వలీ దర్గాలో గంధ మహోత్సవం సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గంధ మహోత్సవం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. చిత్తూరు పార్లమెంట్ టీడీపీ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి మహ్మద్ నబీ, ఖాజాపీర్, రఫీఅహ్మద్, సర్దార్, గాలి జీవరత్నంనాయుడు, ఎస్ఎస్ ధనపాల్, బాబునాయుడు, కౌన్సిలర్ చంద్రాచ్చారి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గోవింద భక్తుల చెక్కభజన

వడమాలపేట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): టీటీడీ అనుబంధ ఆలయమైన అప్పాలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం తమిళనాడుకు చెందిన గోవింద భక్తుల చెక్కభజన అలరించింది. తిరువళ్లూరు జిల్లా కేజీ కండ్రిగకు చెందిన పాండురంగ భజన బృందం ఆదివారం ఆలయ ఆవరణలో రెండు గంటల పాటు గోవిందుడి నామాలతో నృత్య భజన చేసింది.

కలంకారీ దుకాణంలో అమెరికావాసుల సందడి



శ్రీకాళహస్తి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలోని కలంకారీ వస్త్ర దుకాణంలో అమెరికా దేశీయులు సందడి చేశారు. ఆన్‌లైన్ విక్రయాలు జరిపే శుకబ్రహ్మాశ్రమ సమీపంలోని భానోదయ కలంకారీ దుకాణానికి ఆదివారం 8మంది అమెరికన్లు వచ్చారు. చుడీదార్లు, కుర్తా పైజామా, చీరలు, వివిధ రకాల వస్త్రాలను కొనుగోలు చేశారు. కొన్నింటిని అక్కడే ధరించి సంబర పడుతూ సెల్ఫీలు తీసుకున్నారు. ఇలా అమెరికన్లు సందడి చేయడం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది.

భక్తులకు అన్నదానం

వడమాలపేట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): వైకుంఠ నాథుడి ఆశీర్వాదంతోనే దర్శనానికి వచ్చే భక్తులకు నితాన్నదానం చేస్తున్నట్లు ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్‌స్వామి చెప్పారు. అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం ప్రారంభించి ఏడాది పూర్తయ్యిందని చెప్పారు. టీటీడీ అధికారుల ప్రోత్సాహం, భక్తుల సహకారంతోనే అన్నదానం నిర్విఘ్నంగా సాగిందన్నారు. త్వరలో ఉదయం అల్పాహారం అందిస్తామన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

సబ్‌స్టేషన్‌లో ఉద్యోగుల ఘర్షణ

షిఫ్ట్ ఆపరేటర్‌కు గాయాలు

కోట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కోట సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌కో ఉద్యోగుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక సబ్ స్టేషన్‌లో గూడూరుకు చెందిన కిరణ్‌కుమార్ షిఫ్ట్ ఆపరేటర్‌గా, కోట మండలం లక్ష్మక్కకండ్రిగకు చెందిన చంద్రయ్య సహాయకుడిగా పనిచేస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున వీరిద్దరి మధ్య గొడవ జరిగింది. ఆగ్రహానికి గురైన చంద్రయ్య ఇనుప రాడ్‌తో కిరణ్‌కుమార్‌పై దాడి చేయడంలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించి కేసు విచారిస్తున్నట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

గూడూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక సీఆర్‌రెడ్డి కల్యాణ మండపంలో సోమవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు సబ్‌కలెక్టర్ రాఘువేంద్ర మీనా తెలిపారు. కాగా, స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక యాథావిధిగా జరుగుతుందని, ప్రజలు ఈ మార్పును గమనిం చాలని కోరారు.

పక్షుల పండుగ పనులు మొదలయ్యేదెప్పుడు?

మూడు వారాల్లో ఉత్సవాలు ● అపరిశుభ్రంగా పడవల రేవు ● గుంతలమయంగా రోడ్లు


ముళ్లకంపల మధ్య ఉన్న భీములవారిపాళెం పడవల రేవు - రోడ్డు పక్కన ముళ్లకంపలు - గుంతలమయంగా ఉన్న పడవల రేవు రోడ్డు

తడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో నాలుగేళ్లుగా నిలిచిపోయిన పక్షుల పండుగను అట్టహాసంగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. జనవరి 10వ తేదీ నుంచి మూడు రోజులపాటు పక్షుల పండుగ వైభవంగా నిర్వహిస్తామని, ఇందుకోసం రూ.6 కోట్లు వెచ్చించనున్నట్లు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రకటించారు. ఈ మేరకు జిల్లాస్థాయి అధికారులతో కలెక్టర్ రోజూ సమీక్ష నిర్వహిస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో పనులు మాత్రం మొదలు కాలేదు. సాధారణంగా జనవరిలో పక్షుల పండుగను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయిస్తే అంతకు రెండు నెలల ముందే అంటే నవంబరులోనే పనులు మొదలయ్యేవి. జిల్లా స్థాయి అధికారుల సమన్వయ సమావేశాలు, అధికారులు, నాయకులు, స్థానిక మత్స్యకారులతో పండుగ ఏర్పాట్లపై సమీక్షించేవారు. ఇక పక్షుల పండుగ విశిష్టతను చాటి చెబుతూ విజయవాడ, వైజాగ్, నెల్లూరు, తిరుపతి వంటి నగరాల్లో 5కే, 3కే, 2కే రన్ పోటీలు జరిగేవి. ప్రస్తుతం పక్షుల పండుగకు కేవలం 18 రోజుల సమయం మాత్రమే ఉంది. అయితే ఇప్పటికి వరకు ఎటువంటి పనులూ మొదలుకాలేదు. తడ మండలం భీములవారిపాళెంలో పక్షుల పండుగ జరిగే మూడు రోజులూ పడవ షికారు నిర్వహిస్తారు. ప్రస్తుతం పడవల రేవు వద్ద అపరిశుభ్ర వాతావరణం, ముళ్ల చెట్ల పొదలతో నిండిపోయి ఉంది. ఇక రోడ్లు గుంతలమయంగా మారి ముళ్ల కంపలు చొచ్చుకు వచ్చి వాహనాల రాకపోకలకు అనువుగా లేవు. సమయం తక్కువ ఉన్నా క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించకుండా పక్షుల పండుగను ఎలా విజయవంతం చేస్తారోనన్న ప్రశ్న స్థానికుల్లో ఉదయిస్తోంది.

శ్రీనివాస రామానుజన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి

గూడూరు అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గణితశాస్త్ర అభివృద్ధి కోసం ఎనలేని సేవలు అందించిన శ్రీనివాస రామానుజన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ కల్యాణ్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక గాయత్రి పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణిత శాస్త్రానికి రామానుజన్ అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. ప్రతి విద్యార్థీ చిన్నతనం నుంచే లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించేందుకు కష్టపడాలన్నారు. ఏకాగ్రతతో, పట్టుదలతో కష్టపడితే దేన్నైనా సాధించవచ్చునన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన గణిత ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కార్యక్రమంలో శివకుమార్‌రెడ్డి, రఫీ, ధనశ్రీ, శ్రీహరిబాబు, సోనియా, సుప్రజ, హరిత, యామిని, సుప్రియ పాల్గొన్నారు.


గణిత ప్రదర్శనను తిలకిస్తున్న డాక్టర్ కల్యాణ్ కుమార్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది

గంగాప్రసాద్‌పై ఆరోపణలు తగదు: విజయశ్రీ

సూళ్లూరుపేట, పెళ్లకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్‌పై తప్పుడు కథనాలు ప్రచురించడం దుర్మార్గమని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఆదివారం ఆమె తన ఎమ్మెల్యే నివాసంలో టీడీపీ నాయ కులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ వైసీపీకి చెందిన పత్రికలో నిరాధరణ ఆరోపణలతో గంగాప్రసాద్‌పై అసత్య కథనాలను ప్రచురించడం మంచి పద్ధతి కాదన్నారు. సీఎం చంద్రబాబు తమకు విలువలతో కూడిన రాజకీయం నేర్పించారని, ఎవరు తప్పు చేసిన ఉపేక్షించరన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, కొక్కు శంకరయ్య, శ్రీనివాసులు నాయుడు, సంచి కృష్ణయ్య, విజయకుమార్ నాయుడు, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, బొమ్మన పళణి, బొమ్మన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పెళ్లకూరులో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు మాట్లాడుతూ గంగాప్రసాద్‌పై అసత్య ఆరోపణలను ఖండించారు.

గురుకులంలో మత ప్రచారాన్ని అడ్డుకున్నాం: బీజేపీ

కోట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కోటలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ఓ ఉపాధ్యాయురాలు బైబిల్ ద్వారా క్రైస్తవ ప్రచారంతో బోధన చేస్తుండగా తాము అడ్డుకొన్నామని బీజేపీ నాయకులు వాసు, లక్ష్మయ్య, డాక్టర్ రమేష్ ఆదివారం తెలిపారు. అలాగే గురుకులంలో జరిగిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో గురుకులాల జిల్లా కన్వీనర్ నారాయణ రావు క్రైస్తవ మతం ప్రాముఖ్యం గురించి వివరించారని ఆరోపించారు. కాగా, తాము క్రిస్మస్ ఆవశ్యకత చెప్పామే తప్ప, మతప్రచారం చేయలేదని నారాయణరావు స్పష్టం చేశారు.

టిడ్కో ఇళ్ల వద్ద కార్డెన్ సెర్చ్


కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్న సీఐ రమణ, ఎస్ఐ సుబ్బరావు సిబ్బంది

వెంకటగిరి టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణం తిరుపతి రోడ్డులోని టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీ వద్ద పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ రమణ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం ఉదయం 5గంటలకు తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 9 ద్విచక్ర వాహనాలు, ఆటోను సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు సబ్బారావు, గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోండి

నాయుడుపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలని ట్రాన్స్‌కో డీఈ వరప్రసాద్‌రెడ్డి సూచించారు. ఆదివారం నాయుడుపేటలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ వినియోగదారులకు 1 లేదా 2 కిలో వాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానల్‌ను కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పూర్తి రాయితీతో అందజేస్తాయన్నారు. లబ్ధిదారులు వినియోగించుకోగా మిలిగిన విద్యుత్‌ను ట్రాన్స్‌కో కొనుగోలు చేస్తుందని, తద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. ఆసక్తి ఉన్నవారు పీఎంఎస్‌యుఆర్‌వైఎజిహెచ్ఎఆర్‌డాట్‌జీవోవి డాట్‌ఐఎన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

యానాదులకు దుస్తుల పంపిణీ


యానాదులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు

కోట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కోట మండలం తిన్నెలపూడి పంచాయతీ సాయినగర్‌లోని 40 యానాదుల కుటుంబాలకు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ నెలరోజులకు సరిపడా నిత్యావసర సరుకులు పంపిణీ చేసింది. అలాగే దుప్పట్లు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ప్రశాంత్‌బాబు, సుమంత్, డేనియల్, చంద్ర, దినకర్‌బాబు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు


దుప్పట్లు అందజేస్తున్న రవీంద్రబాబు

గూడూరు అర్బన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందలి గ్రామంలో ఉన్న ప్రార్థన మందిరంలో ఆదివారం బాస్ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు కూరపాటి రవీంద్రబాబు ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యశ్వంత్, భావన, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

గూడూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డి, ప్రజేంద్రరెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసరాలను అందజేస్తున్న సంక్షేమ సంఘం ప్రతినిధులు

పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకోండి

పెళ్లకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేయనున్న పక్కా గృహాల కోసం ఇళ్లులేని వారు దరఖాస్తు చేసుకోవాలని నాయుడుపేట డివిజన్ హౌసింగ్ ఏఈ వెంకయ్య కోరారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్రామాల్లో ఇళ్లలేని పేదలను గుర్తించేందుకు సర్వే చేపడుతున్నామన్నారు. అర్హత వున్నవారు ఆయా సచివాలయాల్లో ఆధార్, బ్యాంకు అకౌంట్ పుస్తకం, జాబ్‌కార్డు తీసుకెళ్లి ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

పది మద్యం బాటిళ్ల స్వాధీనం

సూళ్లూరుపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎన్‌వీకండ్రిగ వద్ద ఆదివారం డమాయి స్టాండ్లీ అనే వ్యక్తి వద్ద పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొన్నట్లు సీఐ సురేంద్రబాబు తెలిపారు. సూళ్లూరుపేటలోని ఓ షాపులో మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. స్టాండ్లీపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ సురేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అట్టహాసంగా పక్షుల పండుగ

సూళ్లూరుపేట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వేదికగా పక్షుల పండుగను అట్టహాసంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.6 కోట్లు కేటాయించిందన్నారు. వైసీపీ హయాంలో ఆగిపోయిన ఫ్లెమింగో ఫెస్టివల్‌ను మళ్లీ నిర్వహించేందుకు సీఎం ప్రత్యేక చొరవ తీసుకొన్నారన్నారు. అందరి సహకారంతో అందరూ మెచ్చేలా నిర్వహించేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

సూళ్లూరుపేట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణానికి చెందిన చిరువెల వేణుగోపాల్‌కు రూ.లక్ష 26 వేలు, ఓజిలికి చెందిన కస్తూరయ్యకు రూ.లక్ష 19 వేలు సీఎం సహాయ నిధి నుంచి మంజూరు కాగా, ఆ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు.

ఉద్యమాలకు పురిటిగడ్డ కోట


కార్యక్రమంలో మాట్లాడుతున్న సుధాకర్

కోట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పెత్తందారి వ్యవస్థపై తిరుగుబాటు ఉద్యమాలకు ఊపిరిపోసింది కోట మండలమేనని బహుజన సమాజ్‌పార్టీ ఇన్‌చార్జి షోడవరం సుధాకర్ అన్నారు. కోటలోని షాదీ మందిర్‌లో ఆదివారం దళిత ఉద్యమ నాయకుడు ఆర్‌వీ రమణయ్య సంస్కరణ సభ జరిగింది. పలు జిల్లాల నుంచి వచ్చిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉద్యమ కారులు, ఉద్యోగులు రమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ సముద్రతీర మండలాలైన కోట, చిట్టమూరు, వాకాడు, చిల్లకూరు మండలాల్లో దళిత మహాసభ పేరుతో మొదటి సారిగా ఉద్యమాలు పుట్టాయన్నారు. అలాంటి ఉద్యమాలలో రమణయ్య కీలకపాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణారావు, డాక్టర్ రవికుమార్, బీవీ కృష్ణయ్య, నలమాకుల శ్రీనివాసులు, దారా మస్తానయ్య, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి చేయూత


వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న దాతలు

నాయుడుపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజయ్‌గాంధీ కాలనీలో ఉన్న మేరీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు చెన్నైకు చెందిన పాండ్యరాజ్, శ్యామ్యూల్, ఇస్మాయిల్, ఇక్బాల్ ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వీఆర్వో పద్మనాభరెడ్డి, పసల హరిబాబు, ఆశ్రమ నిర్వాహకురాలు సునీత బెన్నీ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు వార్షిక శిక్షణ తరగతులు

కోట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో రెండవ రోజు అయిన ఆదివారం ఎన్‌సీసీ క్యాడెట్లకు వార్షిక శిక్షణ తరగతులు జరిగాయి. చెన్నై నుంచి వచ్చిన ఎక్స్‌పాఎస్‌జీవో బాలాజీ, హరిహరన్ ఎన్‌సీసీ క్యాడెట్లకు ఉద్యోగాల కల్పన, కొత్త ఆలోచనా విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, శిక్షణ అధికారి మాధవయ్య, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, కోఆర్డినేటర్ రాజేష్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నింద్ర శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వడ్డిపల్లి చెంగయ్య, కార్మికులు

వెంకటగిరిటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిచాఅలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నింద్ర శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి భవన నిర్మాణ కార్మికును ఆదుకోవాలని కోరారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని గుర్తుచేశారు. అనంతరం నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడుగా ఐలమ్మ, అధ్యక్షుడుగా శంకరయ్య, ఉపాధ్యక్షులుగా కొండయ్య, రాజయ్య, ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్, సహాయ కార్యదర్శులుగా గోవిందు బచ్చయ్య, నాగరాజు, కోశాధికారిగా వెంకటసుబ్బయ్య, సభ్యులుగా శ్యాంసుందర్, చెంచు కృష్ణయ్యను ఎన్నుకున్నారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మ వారికి నైవేద్యంగా నివేదించారు. ప్రత్యేక అలంకారంలో ఉన్న ముత్యాలమ్మను దర్శించు కున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఏపీపీ ప్రకృతి కుమార్, సాయికుమార్

వెంకటగిరి టౌన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద యువసైన్యం ప్రచురించిన నూతన క్యాలెండర్‌ను దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. వెంకటగిరి పట్టణంలోని మంత్రి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీపీ ప్రకృతి కుమార్, న్యాయవాది సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీలు


స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రమణకుమార్

కోట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కోట పోలీస్ స్టేషన్‌ను గూడూరు డీఎస్పీ రమణకుమార్ ఆదివారం తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలోని నేరాలు, సిబ్బంది పనితీరు గురించి ఆరాతీశారు. కోట, విద్యానగర్‌లో ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించాలని ఎస్ఐ పవన్‌కుమార్‌ను ఆదేశించారు.

అరణియార్‌ను ఆధునికీకరిస్తా: ఆదిమూలం



ఆదిమూలంను సన్మానిస్తున్న రవిరెడ్డి, ఇళంగోవన్‌రెడ్డి

పిచ్చాటూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): అరణియార్ రిజర్వాయర్ తూర్పు మండలాల మణిహారమని, దాని ఆధునికీకరణకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆదిమూలం హామీ ఇచ్చారు. ఆదివారం ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, ఆయకట్టు చైర్మన్ రవిరెడ్డి, రైతులతో వెళ్లి ఎమ్మెల్యేను ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... జైకా నిధులు రూ.35 కోట్లతో ప్రస్తుతం అరణియార్ ప్రాజెక్టు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నిధుల లేమితో ఆగిన ఆ పనులను పునరుద్ధరిస్తానని తెలిపారు. అలాగే రిజర్వాయర్ వద్ద పర్యాటక కేంద్ర అభివృద్ధి కోసం తుడా నిధులు రూ.1.85 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. శంకరాపురం చెరువు ఆయకట్టు అధ్యక్షుడు పద్దురాజు, వాసురెడ్డి, జయచంద్రనాయుడు, బుజ్జినాయుడు, శ్రీనివాసులు, ఢిల్లీబాబు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



ఆలయం వద్ద కుటుంబీకులతో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.కె.మహేశ్వరి

శ్రీకాళహస్తి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని ఆదివారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.కె.మహేశ్వరి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, వేద పండితులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో 12వ జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్, న్యాయమూర్తులు గురునాథం, ఆలయ అధికారులు విద్యాసాగర్‌రెడ్డి, నాగభూషణంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పరశురామేశ్వరుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ఏర్పేడు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలం గుడిమల్లంలో వెలసిన పరశు రామేశ్వర స్వామిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జడ్జి జస్టిస్ చల్లా గుణకరాజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు, వేదపండితులు పవన్ యోగేంద్రశర్మ, వంశీకృష్ణశర్మ వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందజేశారు.

నా గెలుపులో వన్నియకుల క్షత్రియులే కీలకం

ఎమ్మెల్యే సుధీర్



వన్నియకుల క్షత్రియ నాయకులతో ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): తన గెలుపుకు వన్నియకుల క్షత్రియులు కీలకంగా పనిచేశారని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. తిరుపతిలో ఆదివారం జరిగిన వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డికి వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్ అత్యంత సన్నిహితులన్నారు. ఆయనకు ఈ పదవి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇందులో శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి నలుగురికి డైరెక్టర్లుగా స్థానం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. సీఆర్ రాజన్, సభ్యులు మిన్నల రవి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి



శ్రీకాళహస్తి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి శివకుమార్ దర్శించుకున్నారు. ముందుగా ఆయన రాహుకేతు పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించు కున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆయన్ను ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీ, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పార్థసారథికి ఘనస్వాగతం



మంత్రికి స్వాగతం పలుకుతున్న ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి

రేణిగుంట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పర్యటన నిమిత్తం తిరుపతి జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథికి ఆదివారం తిరుపతి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కొండయ్య, గృహ నిర్మాణ శాఖ డీఈ శ్రీరాములు మంత్రికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. తర్వాత రోడ్డు మార్గాన శ్రీవారి దర్శనార్థం ఆయన తిరుమలకు పయనమయ్యారు. సోమవారం వేంకటేశ్వర స్వామివారి సేవలో మంత్రి పాల్గొననున్నారు.

ఘనంగా గణిత దినం

రేణిగుంట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో గణిత మేధావి రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం గణిత దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థివిద్యార్థులకు నైపుణ్య పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. అల్జీబ్రా, జామెట్రీ, పజిల్స్ వేదిక్, రోబోటిక్స్ తదితర రకాల ప్రాజెక్టుల ప్రదర్శనలిచ్చారు. ప్రొఫెసర్ శివకుమార్ ఈ వేడుకల్లో పాల్గొని విద్యార్థులను గణిత సంబంధిత ప్రశ్నలు అడిగి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గౌతమి, కరస్పాండెంట్ మురళి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం రాత్రి పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల క్రీడామైదానం వద్ద పిచ్చాటూరు రహదారిపై జరిగింది. డిగ్రీ కళాశాల మైదానం వద్ద వృద్ధుడు రోడ్డు దాటుతుండగా శ్రీకాళహస్తి నుంచి పిచ్చాటూరు వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో వృద్ధుడితో పాటు వాహనం నడుపుతున్న యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరు అపస్మారకస్థితికి చేరుకున్నారు. స్థానికులు గుర్తించి క్షతగాత్రులను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఇద్దరినీ తిరుపతి రుయాకు తరలించారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు రోడ్డు ప్రమాదంపై విచారిస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత

శ్రీకాళహస్తి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో తొట్టంబేడు మండల నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. ఆరు నెలల కూటమి ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన శాఖ పరిధిలో ప్రజల కోసం చేస్తున్న కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో పేట చంద్రశేఖర్, మండల నాయకులు, జనసైనికులు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధోత్సవం

శ్రీకాళహస్తి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్టాండు కూడలి సమీపంలో ఉన్న మహబూబ్ సుబహాని ఖాదర్ వలీ జెండామాను వద్ద ఆదివారం ఘనంగా గంధోత్సవాలను నిర్వహించారు. అనంతరం అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో చోటా బాయ్, జి.రమేష్‌బాబు, జి.చంద్రశేఖర్, నజీర్, సుబ్రహ్మణ్యం, బాబుమేస్త్రీ, బాషా, జిలానీబాషా తదితరులు పాల్గొన్నారు.

కుంగిన వంతెనకు మరమ్మతులు చేసేదెప్పుడో?

వర్షాలకు కోతకు గురైన రోడ్డు ● పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



కేటీ రోడ్డులో కుంగిన కల్వర్టు - వర్షానికి కోతకు గురైన రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీకాళహస్తి - తడ రోడ్డులో ఎన్టీఆర్‌నగర్ సమీపంలో రెండు సంవత్సరాలు క్రితం భారీ వర్షాలకు కుంగిన కల్వర్టు మరమ్మతులకు నోచుకోకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎగువ నుంచి వచ్చిన నీటి ఉధృతికి కేటీ రోడ్డులో సుమారు 150మీటర్ల మేర రోడ్డు కోతకు గురైంది. రోడ్డు కోతకు గురైన ప్రదేశంలో ఎటువంటి హెచ్చరిక బోర్డులు పెట్టకపోవడంతో రాత్రి వేళల్లో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు సంత్సరాలు క్రితం కుంగిన కల్వర్టుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డు కోసుకు పోయిందని ప్రజలు చెబుతున్నారు. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణం చేపట్టి కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ప్రతిరోజు 16 కాళ్లమండపంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆదివారం అయ్యప్ప ఉత్సవమూర్తికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్ని స్వామివారిని దర్శించుకున్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

రేణిగుంట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. జెరుసలేం అపోస్టలిక్ చర్చి ఫాదర్ చంద్రన్ డేవిడ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పట్టణంలో భక్తిగీతాలు ఆలపిస్తూ శాంతాక్లాజ్ వేషధారణలో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు యేసుపాదం, వెంకటముని, సీఐ రవి తదితరులు పాల్గొన్నారు.

కబ్జా భూమి పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



భూమి పరిశీలనకు వెళ్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

రేణిగుంట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకంబాడి పంచాయతీలో వైసీపీ నేతల కబ్జా చేసిన భూమిని ఆదివారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. 'కబ్జా భూమి కోసం వైసీపీ నేతల కుస్తీ' శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించి ఈ మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. ఈ పరిశీలనలో తెలుగుదేశం పార్టీ నాయకులు కూడా రెవెన్యూ అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి బుజ్జినాయుడు మాట్లాడుతూ... పాఠశాలకు కేటాయించిన ఐదెకరాల భూమిని పూర్తిస్థాయిలో సర్వే చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యాలయం చుట్టూ ఉన్న స్థలాన్ని భవిష్యత్తు అవసరాలకు ఉపయోగించుకోవడానికి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ మేరకు ప్రహరీని నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో బాబురావు పాల్గొన్నారు.

టిడ్కో గృహ సముదాయంలో

మౌలిక వసతుల కల్పనకు కమిటీ ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న హేమాక్షి

ఏర్పేడు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వికృతమాల సమీపంలో ఉన్న టిడ్కో గృహాల అభివృద్ధికి కమిటీ ఏర్పాటైంది. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో తిరుపతి నగరంలో నివసిస్తున్న 1,600మంది పేదలకు ఇక్కడ టిడ్కో ఇళ్లను పంపిణీ చేశారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ టిడ్కో సముదాయంలో వసతులను కల్పించలేదు. దీంతో స్థానికులు నానా ఇబ్బందులు పడ్డారు. ఇది గుర్తించిన స్థానిక టీడీపీ నాయకులు కమ్యూనిస్టు నేతలతో కలిసి ఆదివారం మౌలిక వసతుల కల్పనకు కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. చైర్మన్‌గా టీడీపీ నేత, వికృతమాల మాజీ సర్పంచ్ హేమాక్షి, అధ్యక్షుడిగా సీపీఐ నాయకుడు శివయ్య సహా 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా హేమాక్షి మాట్లాడుతూ... ఇక్కడి సమస్యలను ఎమ్మెల్యే సుధీర్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. కమిటీ ఆధ్వర్యంలో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు మురళీ, రాధాకృష్ణ, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో జాహ్నవి ప్రతిభ



జాహ్నవిని అభినందిస్తున్న ఉపాధ్యాయుడు

శ్రీకాళహస్తి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాల శాఖ నిర్వహించిన 'వినియోగదారుల సంరక్షణ కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలు వాటి వినియోగం' అనే అంశంపై జరిగిన వ్యాసరచన పోటీల్లో శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థిని జాహ్నవి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి మాట్లాడుతూ వస్తువులు కొనుగోలు చేస్తే తప్పనిసరిగి బిల్లును తీసుకోవాలన్నారు. ఐఎస్ఐ, అగ్ మార్కులను పరిశీలించాలన్నారు. డిసెంబరు 24న వినియోగదారుల దినాన్ని పురస్కరించుకుని రెండు రోజుల పాటు జరిగే పోటీల్లో జాహ్నవి పాల్గొంటుందన్నారు. ఇందుకు ఉపాధ్యాయులు కూనాటి సురేష్ విద్యార్థిని సిద్ధం చేశారన్నారు.

నేడు రైతులకు అవగాహన సదస్సు

వరదయ్యపాళెం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వరదయ్యపాళెం, సంతవేలూరు సబ్‌స్టేషన్ పరిధిలో రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏఈ విజయవెంకట్ తెలిపారు. రైతులు, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది మధ్య సంబంధాలు బాగుండాలని ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు వారి సమస్యలను ఈ సదస్సు ద్వారా తెలిపితే పరిష్కరిస్తామన్నారు.

సిమెంటు రోడ్ల నిర్మాణాలు



పిచ్చాటూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేపడుతున్న సిమెంటు రోడ్లతో గ్రామాలకు మహర్దశ వచ్చిందని టీడీపీ నాయకులు అన్నారు. ఆదివారం మండలంలోని కొత్త గొల్లకండ్రిగలో రూ.13 లక్షల ఉపాధిహామీ నిధులతో నిర్మాణం చేపడుతున్న సిమెంటు రోడ్డుకు భూమి పూజ చేశారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కూటమి నేతలు ప్రేమ్‌బాబు, మురళీబాబు, గోవర్ధన్ యాదవ్, గిరిబాబు, చక్రవర్తి, రవి తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకుడికి నివాళులు

శ్రీకాళహస్తి, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): జనసేన క్రియాశీల నాయకుడు ఇంగోలు లోకనాథం ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత అన్నారు. ఆదివారం ఏర్పేడు మండలం రావిళ్లవారికండ్రిగకు చేరుకుని లోకనాథం మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దహన క్రియల నిమిత్తం రూ.10వేలను వినుత అందజేశారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ సభలు జరిగియి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సుధీర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ చేస్తున్న కృషిని సుధీర్ కొనియాడారు. అనంతరం వారు ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశపు బాలసుబ్రహ్మణ్యం, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి తెగిపడిన విద్యుత్ తీగలు

తప్పిన పెనుప్రమాదం

కేవీబీపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మసముద్రంలో శనివారం అర్ధరాత్రి 11కేవీ విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. అయితే ఆ సమయంలో అందరూ నిద్రలో ఉండటంతో పెనుప్రమాదం తప్పింది. ఆ సమయంలో సర్పంచు దొరబాబు నాయుడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని వెలుపలికి వచ్చి చూడగా వైర్లు తెగిపడి ఉండటం గమనించాడు. వెంటనే రాగిగుంట సబ్‌స్టేషన్ సిబ్బందికి ఫోన్ చేసి విషయం తెలిపాడు. అయితే సిబ్బంది వెంటనే స్పందించకపోగా ఆదివారం ఉదయం వచ్చి మరమ్మతులు నిర్వహించిన్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్‌శాఖ నిర్లక్ష్యానికి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తికి తీవ్రగాయాలు

ఏర్పేడు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన ఏర్పేడు మండలంలో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు మేర్లపాక పంచాయతీ కొత్తకండ్రిగలో ఆదివారం ఊరు ఉత్సవం జరిగింది. దీన్ని తిలకించడానికి శ్రీకాళహస్తి మండలం తొండమనాడు గ్రామానికి చెందిన కొందరు వచ్చారు. కార్యక్రమం ముగిసిన అనంతరం తిరిగి ఇంటికి వెళ్తుండగా మేర్లపాక పుష్పిత్ స్టీల్స్ ప్రైవేటు లిమిటెడ్ ఫ్యాక్టరీ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తి అపస్మారకస్థితిలో ఉండటంతో వివరాలు తెలియడంలేదు. అటుగా వెళ్తున్న వారు గుర్తించి చికిత్స నిమిత్తం ఆయన్ను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి ప్రైవేటు వాహనంలో తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందలేదు.

బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ

నారాయణవనం, డిసెంబర్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలమంగళంలో ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గ్రామ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా మునిశంకర్, అధ్యక్షుడిగా వేలాయుధం, కార్యదర్శిగా ఆర్ముగం, కోశాధికారిగా మునిరత్నం, కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.

సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యేకు మెకానిక్‌ల వినతి

శ్రీకాళహస్తి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని శ్రీకాళహస్తి ఆటోమొబైల్ మెకానిక్ ఇంజనీరింగ్ యూనియన్ నాయకులు ఎమ్మెల్యే సుధీర్‌కి విన్నవించారు. ఆదివారం వారు ఎమ్మెల్యేను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటోమొబైల్ మెకానిక్ ఇంజనీరింగ్ గ్యారేజీ స్థలాన్ని కేటాయించాలన్నారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. గోపి, మోహన్‌గౌడ్, మునిగోపాల్, సాదిక్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

అల్లం లారీ బోల్తా



శ్రీకాళహస్తి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): వేకువజామున పొగమంచు కారణంగా అల్లం లారీ బోల్తా పడింది. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణంలోని వీఎంపల్లి వద్ద జరిగింది. కేరళ నుంచి కోల్‌కతాకు అల్లం లోడుతో లారీ బయలుదేరింది. మార్గమధ్యంలో వీఎంపల్లి వద్ద జాతీయ రహదారిపై పొగమంచు కారణంగా లారీ అదుపు తప్పి బోల్తా పడింది. కోల్‌కతాకు చెందిన డ్రైవర్ ఎస్‌కే అనూరుల్, క్లీనర్ సుమోన్ స్వల్పగాయాలతో బయట పడ్డారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్యాయత్నం

శ్రీకాళహస్తి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తొట్టంబేడు మండలం రౌతుసూరమాలకు చెందిన వెంకటేష్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. కుటుంబ కలహాలతో ఆదివారం ఇంటి వద్ద పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు గుర్తించి శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు.

దుప్పట్లు, స్వెట్టర్ల పంపిణీ



ఏర్పేడు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజిమేడు పంచాయతీ పోతుమానుగుంట గిరిజన కాలనీలో లక్ష్మీ నరసింహ చారిటబుల్ ట్రస్టు, యువతేజం ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు దుప్పట్లు, స్వెటర్లు పంపిణీ చేశారు. సుమారు 60 కుటుంబాలవారికి అందించారు. ప్రజాప్రగతి ట్రస్టు కోఆర్డినేటర్ చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.